క్లుప్తంగా

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని పాత రుద్రారం గ్రామంలో పబ్బ మెండయ్యకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివారల ప్రకారం మెండయ్యకు చెందిన ఇంటిలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన మెండయ్య, వారి కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వారి సహాయంతో నీటితో మంటలను ఆర్పారు. మంటల కారణంగా ఇంటిలోని సామగ్రి, బైక్ కాలిపోయినట్లు బాధితుడు తెలియజేశారు. కాగా, తహసీల్దార్ శ్రీనివాస్ గురువారం ఇంటి వద్దకు చేరుకోని నష్టం వివరాలు సేకరించారు.

సన్మానం



ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెంలోని ఇటీవల పదవీకాలం ముగిసిన గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని గురువారం గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా వారి పదవీ కాలంలో అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

దసలి పట్టుగుడ్ల వేలం



మహదేవపూర్: దసలి పట్టు గుడ్ల ఉత్పత్తి కేంద్రం ద్వారా సేకరించిన పట్టు గుళ్ల(కాయలు)కు గురువారం వేలం నిర్వహించారు. పట్టు పరిశ్రమ శాఖ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ సంయుక్త సంచాలకులు అనుసూయ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. మహారాష్ట్ర, ఛతీస్‌గఢ్, జార్కండ్, రాష్ట్రాల నుంచి వేలంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖ సహాయ సంచాలకుడు రవిప్రసాద్, దయాకర్‌రావు, నరేందర్, సమ్మయ్య, దుర్గయ్య, సారయ్య, రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

శాయంపేట : విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని ఎస్సై దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు లాంగ్ జంప్, హైజంప్ ప్రాక్టీస్ కోసం ఎస్సై తన సొంత ఖర్చుతో ఇసుకను పోయించి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి మైదానంలో లైట్లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని అన్నారు. తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షల సమయం సమీపిస్తున్నందున ఒత్తిడికి లోనవ్వకుండా స్వేచ్ఛగా చదవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోతే రాజ్‌కుమార్, పీఈటీ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

శిఖం భూములు కనుమరుగు!

- చెరువుల్లో అక్రమ సాగు
- పట్టించుకోని అధికారులు



బోరునర్సాపురం ఉప్పలనర్సయ్య చెరువు శిఖం భూముల్లో సాగుచేసిన వరిపంట

మంగపేట: మండలంలోని చెరువు శిఖం భూములు ప్రతి ఏటా ఎకరాల కొద్ది ఆక్రమణకు గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో రాబోయే రోజుల్లో చెరువులే కనుమరగయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే శిఖం భూములను కబ్జాచేసిన వ్యక్తులు ఏకంగా సాగు భూములుగా మార్చి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసుకుని బోరుబావులు నిర్మించి వందలాది ఎకరాల్లో అక్రమంగా సాగు చేస్తున్నారని ఆయా చెరువుల ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని చెరుపల్లి రెవెన్యూ పరిధిలోని కోతుల కుంట చెరువు కబ్జాకు గురై ఆనవాల్లే లేకుండా పోయాయి. శిఖం భూములను దర్జాగా కబ్జా చేస్తుంటే అడ్డుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మండలంలో మొత్తం 88 చెరువులు ఉండగా దాదాపు 75 శాతం చెరువు శిఖం భూములు కబ్జాకు గురయినట్లు సమాచారం. కబ్జాకు గురైన భూముల్లో కొందరు బడా రాజకీయ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ధనవంతులు ఉండటంతో వారిని అడ్డుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరైతే ఏకంగా శిఖం భూముల్లో జామాయిల్(యూకలిప్టస్) తోటలు పెంచడం ఆశ్చర్యకరం. మండలంలోని కమలాపురంలోని ఉర చెరువు, కవ్వాలకుంట చెరువు, చెరుపల్లిపెద్దచెరువు, మంగపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన్నే ఉన్న వెంకన్నకుంట, గొల్లకుంట, గంపోనిగూడెం చెరువు, బోరునర్సాపురంలోని మామమిడికుంట, ఉప్పలనర్సయ్యచెరువు, మల్లూరు అత్త, కోడలు చెరువులతో పాటు తిమ్మంపేట ఊరచెరువు, తిమ్మ చెరువుల్లో వందలలాది ఎకరాల శిఖం భూములు కబ్జాదారుల కబంధహస్తాల్లో బందీ అయ్యాయి.

అధికారుల నిర్లక్ష్యం..

మండలంలో సంబంధిత రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగానే చెరువుల శిఖం భూములు కబ్జాకు గురయ్యాయని ఆయా చెరువుల ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. చెరువుల శిఖం భూములు కబ్జాచేసి అక్రమంగా సాగు చేస్తున్నారని, చెరువుల్లోకి నీరు రాగనే వారి పంటలు నీట మునగకుండా తూములషట్టర్లు తొలిగిస్తున్నారని వాపోతున్నారు. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందడంలేదని అధికార్లుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కబ్జాను అడ్డుకోక పోవడమే కాకుండా శిఖం భూముల్లో అక్రమంగా నిర్మించిన బోరుబావులకు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వడంతో అక్రమార్కులు సాగు భూములుగా మార్చుకున్నారని రైతులు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసి రెండేళ్లు గడిచింది



మల్లూరు అత్త, కోడలు చెరువులో కబ్జాకు గురైన శిఖం భూములపై అప్పటి తహసీల్దార్ శ్రీనివాసులుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. రెండేళ్లు గడిచిన ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. కబ్జాకు గురైన భూముల్లో అక్రమంగా బోరుబావులు నిర్మించి సాగు చేస్తున్నారు.

– విజయబాబు పెసా మొబిలైజర్, మల్లూరు

జాయింట్ సర్వే చేపడతాం..

మల్లూరు కోడలు చెరువు శిఖం భూముల కబ్జా అయిన ఫిర్యాదుపై ఇరిగేషన్ అధికారులతో కలిసి రెండు రోజుల్లో జాయింట్ సర్వే నిర్వహిస్తాం. రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తాం. అక్రమంగా కబ్జాచేసిన వారిపై చట్టపరంగా చర్య తీసుకుంటాం.

– బైరి వీరస్వామి, తహసీల్దార్ మంగపేట

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మధు

భూపాలపల్లి అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ నాయకులు మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్‌లో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల నాయకులు మధు, సతీష్ మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో మోదీ ప్రభుత్వం రద్దు చేస్తూ, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. 12 గంటల పని విధానంతో కార్మికులను వెట్టి చాకిరి చేయించాలని కుట్రలు చేస్తున్నారన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి దేశ భవిష్యత్‌ని ప్రశ్నార్థకంగా మార్చి, దేశ సంపదను కార్పొరేట్లకు అప్పనంగా దోచిపెట్టడానికి సిద్ధపడుతున్నారని ఆరోపించారు. కేంద్ర పభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించే విధంగా 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కాంట్రాక్టు కార్మికులందరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు రాజయ్య, వెంకటేశ్, రాజేష్, క్రాంతి, సారయ్య, సుధాకర్, లక్ష్మి, సంపత్ పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా



తాగునీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

శాయంపేట : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్ తరచూ లీకేజీ అవడంతో సంబంధిత శాఖ అధికారులు పైపులైన్ పనులను చేపట్టగా నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామ పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేస్తూ నెట్టుకొస్తున్నారు. పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు



జేసీబీతో గుంతలు తీయిస్తున్న సీఐ వేణుచందర్

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు, నవాబుపేట చలి వాగుల నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వేణుచందర్, ఎస్సై రమేష్ అన్నారు. గురువారం మండలంలోని కాల్వపల్లి మానేరు చుట్టూ ట్రాక్టర్లు లారీలు వెళ్లకుండా గుంతలు తీశారు. రెండు రోజుల్లో చలివాగు ప్రాంతాల్లో గుంతలు తీయించి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, రాజు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత..

మండలంలోని కాల్వపల్లి మానేరు వాగులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భూపాలపల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన దేవేందర్‌కు చెందిన ట్రాక్టర్‌ను గ్రామ శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



వెంకటాపురం(కె): పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



మహాముత్తారం: పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ



కాళేశ్వరంలో..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీలోని చర్పిపేటలో పంచాయతీ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం పంచాయతీ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సర్వర్ ఆధ్వర్యంలో డ్రెయినేజీలను శుభ్రపరిచారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పంచాయతీ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ఈ నెల 14 వరకు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు గురువారం గోదావరి తీరం వద్ద చెత్తను తొలగించారు. మెట్లు, తీరం పరిసరాల్లో క్లీనింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: జీపీల్లో ప్రత్యేక శానిటేషన్‌లో భాగంగా రెండు రోజులుగా వివిధ గ్రామాల్లో సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. గురువారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది చేపడుతున్న శానిటేషన్ పనులను ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాటారంలో..

కాటారం: శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ సంస్థలు, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలిగించారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు కలియ తిరిగి సమస్యలను పరిశీలించారు. మురుగునీటి కాల్వలను శుభ్రపర్చాలని, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రజా పరిపాలనలో భాగంగా కాటారం గ్రామపంచాయతీలో మహాలక్ష్మి పథకాని వచ్చిన దరఖాస్తులను ప్రత్యేకాధికారి సంజీవరావు ఇంటింటా తిరిగి వేరిఫికేషన్ చేశారు. దరఖాస్తుదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారులు తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ ఉపేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉమారాణి, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భూపాలపల్లి అర్బన్: కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కక్ష సాధింపు చర్యలకు నిరసనగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అవినీతి లేని పాలన సాగుస్తున్న కేరళ రాష్ట్రాన్ని లొంగతీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. న్యాయంగా కేరళకు రావల్సిన వాటాలలో కోతలు విధిస్తుందని, మోదీ సర్కార్ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, శేఖర్, మహేందర్, నరేష్, విజయలక్ష్మి, శ్రీలత, గీత, రజితలు పాల్గొన్నారు.

ధ్రువప్రతాలు అందుబాటులో ఉంచుకోవాలి

ఏటూరునాగారం: ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులదారుల వివరాల సేకరణకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వే కొనసాగుతున్నదని ఏటూరునాగారం ఎస్ఈ మల్సూర్, డీఈ నాగేశ్వర్ రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు వారి ప్రజాపాలన దరఖాస్తు రశీదు, ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు), ఆధార్ కార్డు నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఏదైనా కారణం వల్ల తమ సిబ్బంది వచ్చినప్పుడు దరఖాస్తుదారులు అందుబాటులో లేకుంటే దగ్గరల్లోని విద్యుత్ సహాయ ఇంజనీరింగ్ కార్యాలయం, విద్యుత్ సహాయ గణక అధికారి కార్యాలయంలో గాని వివరాలను సమర్పించి ధ్రువీకరించుకోవాలని వివరించారు.

యువత దేశసేవలో భాగస్వాములు కావాలి



రాజారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : యువత సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో దేశసేవలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ కోరారు. మండలంలోని ఎదల్లపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ సైనికుడు చలమల్ల రాజారెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం పట్టణానికి గురువారం చేరుకోగా ఆయనకు యువత ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో విశ్రాంత సైనికుడు రాజారెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం సాంబయ్య మాట్లాడారు. యువత దేశ రక్షణకు సేవలు అందించడంలో పోటీ పడాలన్నారు. సైనికులే నిజమైన దేశభక్తులని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండెం రతన్‌కుమార్, నాంపల్లి వెంకన్న, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్, బాలు, వెంకన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న గ్రూప్ సభ్యులు



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రబృందం

ములుగు రూరల్: మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన పొలం నర్సక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి గురువారం గ్రామంలోని అంబేద్కర్ గ్రూప్ సభ్యులు, కాలనీ వాసులు రూ. 22వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ గుండబోయిన రవిగౌడ్ రవిగౌడ్ మాట్లాడుతూ గ్రూప్ సభ్యులు, కాలనీ వాసులు విరాళాలు సేకరించి అందించడం అభినందనీయమని అన్నారు. భిక్షపతి, మహేందర్, అంకూష్, చంద్రమొగిలి, తిరుపతి, నాగరాజు, రమేష్, ప్రవీణ్ , నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మహాముత్తారం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బానోత్ జగన్‌నాయక్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో జగన్ నాయక్ స్నేహితులు రూ.లక్ష 71 వెయ్యిలను బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా అందజేశారు.

నేడు పెసా గ్రామసభ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరంలో ఇసుక క్వారీ నిర్వహణకు నేడు(శుక్రవారం) పెసా గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిండి‘కేటుగాళ్లు’!

- బెల్ట్‌షాపులకు వైన్‌షాప్ నిర్వాహకుల బెదింపులు!
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



వైన్‌షాప్‌లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధిత వ్యక్తి

టేకుమట్ల: వైన్‌షాప్ నిర్వాహకులు సిండికేట్‌గా మారి బెల్ట్‌షాపులకు అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ దందా కొనసాగిస్తున్నారు. వైన్‌షాప్ నిర్వాహకులు రైడింగ్ పేరుతో ఒక బృందంగా ఏర్పడి గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో దాడులు నిర్వహిస్తూ, సిండికేట్ షాపులోనే బెల్ట్‌షాప్ నిర్వాహకులు మద్యాన్ని కొనాలని, లేకుంటూ మీరు విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకుని ఎక్సైజ్ పోలీసులచే కేసులు పెట్టిస్తామని బెదిరింపులకు పాల్పడుతురు. మహిళలపై అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తూ పేట్రేగిపోతున్నాట్లు తెలుస్తోంది. బుధవారం సాయంత్రం మండలంలోని రామకిష్టాపూర్(వి)లో వైన్ షాపు నిర్వాహకులు మహిళతో అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం. రైడింగ్ పేరుతో ఇద్దరు వ్యక్తులు ఓ కిరాణం, ఇళ్లల్లోకి వెళ్లి సోదా చేసి ఇంట్లో ఎవరూ లేరని చెప్పినప్పటికీ మహిళతో దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. దీంతో సదరు మహిళ ఆమె భర్తతో చెప్పడంతో గురువారం ఉదయం మండల కేంద్రంలోని వైన్‌షాప్ వద్దకు చేరుకుని వైన్‌షాప్ నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కూడా ఓ కిరాణంలో రైడింగ్ పేరుతో ఐదుగురు వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి నానా హంగామా చేశారని కిరాణ షాపు యాజమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

మండల కేంద్రంలో రెండు వైన్ షాపులకు గానూ ఒకే షాప్ నుంచి మద్యాన్ని విక్రయిస్తూ, మరొక షాప్ నుంచి నిరంతరం బెల్ట్‌షాపులకు అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులే అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న సిండికేట్ దందాపై ఇప్పటి వరకు జిల్లా ఎక్సైజ్ అధికారులు మాత్రం చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ అధికారులు స్పందించి అక్రమ సిండికేట్ దందాపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైడింగ్ చేస్తే ఫిర్యాదు చేయండి..

గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించొద్దు. వైన్‌షాప్ నిర్వాహకులు దుకాణాలపై రైడింగ్ చేస్తే వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. వైన్‌షాప్ నిర్వాహకులు చేసే రైడింగ్‌కు తమకు సంబంధం లేదు. వైన్‌షాప్‌లో అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– మాన్‌సింగ్, ఎక్సైజ్ ఎస్సై భూపాలపల్లి

నర్సయ్య మృతి విప్లవోద్యమాలకు లోటు

నల్లబెల్లి : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాజీ దళ నాయకుడు, మాజీ సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నమల నర్సయ్య అకాల మృతి విప్లవోద్యమాలకు లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చిన్న చంద్రన్న తెలిపారు. మండలంలోని నారక్కపేటలో జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సంతాపలో చంద్రన్న పాల్గొని మాట్లాడారు. నర్సయ్య చివరి శ్వాస ఉన్నంత వరకు పీడిత ప్రజల పక్షాన పోరాడారని తెలిపారు. పేదలకు పోడు భూములను పంచడంలో, ఇతర సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. పార్టీ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా పేదలకు ఎనలేని సేవలు అందించారని చెప్పారు. నర్సయ్య ఆశించిన నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యాన్ని సాధించడానికి యువత నడుంకట్టాలని కోరారు. తొలుత నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో మాజీ ఎంపీపీలు బానోత్ సారంగపాణి, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ ఉన్నారు.